# పద్మావతీవిలాస్



వి. వి. రమణారావు

రాత్రంతా వర్షం కురిసినట్టు ఉంది; నేలంతా చిత్తడి చిత్తడిగా ఉంది. రోడ్డుమీద ఉన్న మురికి గుంటలని దాటుకుంటూ శ్రీనివాసా కేఫ్ లోపలికి అడుగు పెట్టాను. గుమ్మంలో ఉండగానే 'రండి పంతులుగారూ! రండి!' అంటూ చెంగయ్య స్వాగతం పలికాడు. సుమారు పదిహేను సంవత్సరాలబట్టీ, ఆ ఆహ్వానం నాకు పరిచయమైనదే అయినా, ఇటీవల మాత్రం ఆ మాటలు వినగానే నాకు ఆహ్లాదం కలక్కపోగా ఏదో చిరాకు ముంచుకొస్తూంది. దానికి కారణం లేకపోలేదు మరి!

సెలక్షను గ్రేడ్ – టీచరుగా ఉద్యోగం రాగానే, పుట్టి పెరిగిన ఊరికి దగ్గరగా ఉంటుందని చెప్పి ఒంటిమిట్టపాలెం ట్రాన్స్ఫరు వేయించుకుని వచ్చేసాను. వచ్చాక గాని అక్కడ కాఫీ తాగడానికి ఒక మంచి హోటలు కూడా లేదన్న సంగతి నాకు తెలియలేదు. అసలు మొదట్నించీ కాఫీగత ప్రాణమేమో, ఒక వారం రోజులు మంచి కాఫీ దొరక్క విలవిలలాడి పోయాను. అలా విలవిల్లాడి పోతూన్న తరుణంలో, ఒంటిమిట్ట పాలేన్ని, పట్నానికి కలిపే రోడ్డులో ఊరికి చివరగా చెంగయ్య టీ కొట్టు ఆపద్బాంధవిలా అవతరించింది.

రేకులషెడ్డు. ఒకవేపు ఎత్తుగా కట్టిన సిమెంటు దిమ్మమీద చిన్న బాయిలరు. పక్కనే నాలుగైదు డబ్బాలు. మరొకవేపు నాలుగైదు బెంచీలు. పక్కనే రెండు పెద్ద కుండల్లో నీళ్ళు. మధ్యలో నల్లగా మకిలి పట్టి పోయిన అద్దాలు బిగించిన బీరువాలో ఉన్న పళ్ళాల్లో. కారప్పూస, పకోడి లాంటి ముడిసరుకు. కాస్తంత శుచీ, శుభ్రం పాటించే వాడెవడైనా ఆ బీరువా వేపు చూస్తే, మరింక ఆ సరుకు ముట్టడు. అయితే చెంగయ్య అదృష్టం ఏమిటంటే, అతని ఖాతాదారుల్లో నేను తప్ప అలాంటివాళ్ళెవరూ లేరు. ఒంటిమిట్ట పాలెంనించి పట్నానికి రోజుకి సుమారు పది పదిహేను బస్సులు అటూ ఇటూ వస్తూ పోతూ ఉండేవి. ఆ వచ్చేపోయే బస్సుల డ్రైవర్లకి, ఫ్రీ కాఫీలు, టీలు ఇచ్చి బస్సులు అక్కడ ఆపించేసేవాడు చెంగయ్య. అరగంట బస్సు ఆగిపోతే, విసుక్కుంటూ ప్రయాణీకులు తప్పనిసరిగా దిగి చెంగయ్య కొట్లో టీ, కాఫీలు తాగేవారు. ఒట్టి కాఫీలు తాగలేనివారు, ఇంకేమి లేక,

ఆ నిలవసరుకు తెప్పించుకొని కాస్త తిని పోయేవారు. అయితే నేను మాత్రం ఆ అద్దాల బీరువావేపు చూడ్డానికి కూడా సాహసం చేసేవాడ్నికాదు. గుమ్మంలోనే ఉన్న కుర్చీలో కూర్చుని కాఫీ తెప్పించుకునేవాడ్ని. చిక్కటి పాలలో, బ్రూ కలిపి, చెంగయ్య నాకు స్వయంగా కమ్మటి కాఫీ కలిపి ఇచ్చేవాడు. అందుకే ఎంత దూరం అయినా సరే, సాయంత్రం అయేసరికి, చెంగయ్య హోటలు దగ్గరకు వెళ్ళక తప్పేదికాదు నాకు.

రానురాను ఆ రూటులో బస్సులు ఎక్కువయ్యాయి. జనం రద్దీకూడా పెరిగింది. దాంతో చెంగయ్య టీ కొట్టు సైజు పెరిగింది. క్రమంగా చిన్నహోటలు లేవదీసాడు చెంగయ్య. చెంగయ్య అదృష్టమో ఏమోగాని అతను పట్టిందల్లా బంగారం అవడం మొదలు పెట్టింది. ఒంటిమిట్టపాలెం ఊరు పెద్దదయింది. చెంగయ్య చిన్నహోటలు, పెద్దహోటలుగా మారిపోయింది.

శ్రీనివాసా కేఫ్‌లో ఎప్పుడు చూసినా కిటకిట లాడిపోయేవారు జనం. సుమారు ఇరవయిమంది సప్లయర్లు ఎప్పుడు చూసినా, విసుగూ విరామం లేకుండా వచ్చేపోయేవాళ్ళకి కాఫీలు అందిస్తూనే ఉంటారక్కడ. చెంగయ్యకు, అతనున్న ఇల్లుకాక, మరో మూడు మేడలు లేచాయి. ఎంత ఉచ్ఛస్థితికి పోయినా, చెంగయ్యలో మాత్రం మార్పులేదు. మనిషి ఎప్పటిలా అందరినీ, సాదరంగా ఆహ్వానిస్తూనే ఉంటాడు. అతనిలో కించిత్తు గర్వం గాని, అతిశయం గాని ఎప్పుడూ కనబడలేదు నాకు. అంతా బాగానేఉంది. అయితే మరి అతని మీద నాకు చిరాకు కలగడానికి కారణం ఏమిటి ?

ప్రతి మనుష్యుడిలోనూ ఏవోకొన్ని బలహీనతలు ఉంటాయి. తనకు ఇతరులు అన్యాయం చేస్తున్నారేమోనన్న బాధఉండటం, అందులో ఒకటి. అలాటి బలహీనతే ఈ మధ్య నాకూ పట్టుకుంది. అయితే ఈ బలహీనత నాలో కలగడానికి, పరోక్షంగా చెంగయ్యకూడా కొంత కారకుడే.

మొదట్లో చెంగయ్య హోటల్లో ఇడ్లీలు, అరచెయ్యి మందాన ఉండేవి. నోట్లో వేసుకుంటే, కరిగి పోయేలా, వెన్నలా, మృదువుగా బాగుండేవి. అందులోకి ఘుమఘుమలాడే అల్లం చట్నీ, లేత కొబ్బరి చట్నీ నంచుకు తింటూంటే స్వర్గంలో ఉన్నట్లుండేది. కాని, రానురాను ఇడ్లీలసైజు తగ్గి పోయింది. అప్పుడే చెంగయ్య మొదటి మేడ కట్టాడు. మేడకట్టాక ఇడ్లీలసైజు తగ్గించేడో, ఇడ్లీలు సైజు తగ్గించాక మేడ కట్టేడో నాకైతే గుర్తులేదు గాని, నాకు ఎందుకో. నాడబ్బుకూడా పెట్టి చెంగయ్య మేడలు కట్టించేస్తున్నాడే అన్న దుగ్ధ బయలు దేరింది. చెంగయ్య రెండో మేడ కట్టేసరికి నాకు దుగ్ధకాస్తా మంట కింద మారింది.

'ఇదేమిటయ్యా, సైజు మరీ రానురాను తగ్గించేస్తున్నావ్?' అని అంతకీ నిలదీసి అడిగేసాను చెంగయ్యని, ఓసారి.

'ఏం చెప్పమంటారు పంతులుగారూ! మినప్పప్పు కిలో మూడు రూపాయలకి కూడా దొరకటంలేదు. ఇంక కొబ్బరికాయల ధర మీరడగాలా? ధరలు అన్ని మండిపోతూంటే మునుపటి సైజులో ఇడ్లీలు ఎలా సప్లయి చెయ్యమన్నారు చెప్పండి?'

నాకు ఆ సమాధానం విని ఒళ్ళు కుతకుతలాడి పోయింది. అంత లాభసాటి వ్యాపారం లేనివాడు మరో మేడ ఎలా కడతాడు?

అదిగో, అది మొదలు చెంగయ్య మీదా, చెంగయ్య హోటలు మీదా కూడా నాకు చిరాకు ముంచుకు రాడానికి.

రానురాను చెంగయ్య హోటలు మరీ దారుణం అయిపోయింది. భోజనంలోకి రెండు కూరలనించి ఒక కూరకి తగ్గించేసాడు సాంబారులో ముక్కలు అసలు కనపడేవి కావు. మజ్జిగ వాసన కొడుతూ ఉండేది. ఆభోజనానికే రెండు రూపాయలు ముక్కున వడేసినట్లు పుచ్చుకునేవాడు. అన్ని వస్తువులూ అధిక ధరలనడం దేనికి, సైజులు తగ్గించేసి రేట్లు పెంచేసాడు. అంతకీ ఒకసారి ఎవరో కాలేజీ కుర్రాళ్ళు గొడవపెట్టారు. కాని ఎలాగో వాళ్ళని సర్దేశాడు. అప్పటినించీ యధేచ్ఛగా రాజ్యం ఏలుతున్నాడు చెంగయ్య.

అదేం ప్రారబ్ధమోగాని, శ్రీనివాసా కేఫ్‌కి, అటు ఫర్లాంగు దూరంలోనూ, ఇటు ఫర్లాంగు దూరంలోనూ ఇంకొక హోటలు ఏదీ రాలేదు. పోనీ సుమారు ఓ మాదిరి టిఫినైనా దొరుకుతుందేమో ననుకుంటే, చిన్న టీ బంకులు తప్ప మరేవీ లేవు. అక్కడ బిస్కట్లు తప్ప మరేవీ దొరకవు. అందుకని చెంగయ్య హోటలుకి వెళ్ళక తప్పింది కాదు నాకు.

నిస్సహాయత ఎక్కువైపోయిన కొద్దీ, నాకు చెంగయ్య హోటలు మీద కోపం ఎక్కువయిపోసాగింది. అనాదిగా మనుషులతో జరిగే ఎక్స్‌ప్లాయిటేషన్‌కి చెంగయ్య ప్రతిబింబంలా కనిపించ సాగాడు. 'లాభం లేదు! చెంగయ్య అలా మనుషుల్ని పీల్చేసి లాభాలు గడించడం నేను సహించలేను. కాని ఏం చెయ్యాలి?' నాకేం తోచలేదు. అదిగో అప్పుడే ఒకరోజు...

'హోటల్ పద్మావతి, ఓపెనింగ్ షార్ట్‌లీ' అని తాటి కాయలంత సైజులో రాసి ఉన్న అక్షరాలు నాకళ్ళపడ్డాయి. ఎక్కడో కాదు సాక్షాత్తూ, చెంగయ్య హోటలు శ్రీనివాసాకేఫ్ పక్కనే. నాహృదయం ఆనందంతో నిండిపోయింది. ఎన్నాళ్ళకెన్నాళ్ళకు?

ఈదెబ్బతో చెంగయ్య రోగం కుదరాలి.



అమెరికా అధ్యక్షుడుగా ఎన్నికైన జిమ్మీకార్టర్ సతిమణి శ్రీమతి రోజాలిన్ "వైట్ హవుస్" కేకును కోసి పార్టీ యిస్తున్న దృశ్యం.

# పద్మావతీ విలాస్

అసలేఫీల్డులో నైనా కాంపిటీషను ఉండాలి. అప్పుడే ధరలు కాస్త అదుపులో ఉంటాయి. ఇది హోటళ్ళ విషయంలో మరీ వర్తిస్తుంది.

స్వయంగా దగ్గరకువెళ్ళి ఆ బోర్డుని తనివితీరా చూసాను. కూలీలు పని అప్పుడే ప్రారంభించారు. ప్రత్యేకం పనులు చకచక జరిగిపోతున్నాయి. బళ్ళమీద ఇటుకలు, ఇసుక వచ్చిపడుతున్నాయి. అక్కడ పని జరిగే వేగం చూస్తూంటే ఇంకో నెలరోజుల్లో హోటలు ప్రారంభం అయిపోయేటట్టే ఉంది.

నాకు ఎందుకో మనశ్శాంతి కలిగినట్టయింది. ఇంక చెంగయ్యకు కొంచెం బెదురు కలుగుతుంది. ఎలా అయినా, పక్కనే మరో హోటలొస్తే సగం వ్యాపారం పడిపోయినట్టే కదా! అందులోనూ పక్కహోటలు బాగున్నట్టయితే,మొత్తం వ్యాపారంపడిపోయినట్టే.

'అవాల్సిందే' అనుకున్నాను కసిగా.

లేకపోతే మరీ అంత డబ్బు కక్కుర్తా! పది పైసలంత బరువు కూడా లేని ఇడ్లీలు, పదిహేను పైసల కమ్మడం, అలా వచ్చిన లాభాల్తో, మేడలు, మిద్దెలు కట్టించెయ్యడం, ఈ లోకంలో ప్రతివాడూ తన బాగు తను చూసుకునేవాడే. అందులో చెంగయ్య మరీ తెలివి మీరిపోయాడు.

ఆ రోజు నించీ, టిఫిను తినడం అయిపోగానే పోయి, ఆ కడుతూన్న హోటల్ని పర్యవేక్షించి వస్తూండేవాడ్ని. ఎవడు కట్టిస్తున్నాడోకాని, ఏ మాట కామాటే చెప్పుకోవాలి, చెంగయ్య కన్నా మంచి అభిరుచి ఉన్నవాడే ననిపించింది. విశాలమైన హాలు, చేతులు కడుక్కోడానికి వరసన ఆరు తొట్టెలూ, కళ్ళు జిగేల్మనిపించేలా లైటింగు అరేంజిమెంట్లూ;

ఆ హోటలు ముందు, చెంగయ్య హోటలు దివిటీ ముందర దీపంలా ఉంటుందనడానికి నాకేమాత్రం సందేహంలేదు.

'పాపం చెంగయ్య!' అనుకున్నాను.

నాకు చెంగయ్యమీద కొంచెం జాలి కలిగింది. ఏదో పాపం, కడుపు కక్కుర్తికొద్దీ డబ్బు సంపాదించాడుగాని, మనిషి నమ్రత, వినయం ఉన్నవాడే. ఇప్పుడు పాపం నష్టంలోకి దిగిపోతాడు కాబోలు. నా అంతరాంతరాల్లో ఎక్కడో చెంగయ్యంటే కొంచెం సానుభూతి ఏర్పడసాగింది. కాని మళ్ళీ నాకు జరుగుతూన్న అన్యాయం గుర్తుకి వచ్చినప్పుడల్లా చెంగయ్యకు ఆ శాస్తి కావలసిందేనని పించ సాగింది.

నా మనసులో ఆలోచనలు అలా ఉండగానే నెల రోజులు ఇట్టే గిర్రున తిరిగిపోయాయి. నే ననుకున్న శుభ సమయం రానే వచ్చేసింది. హోటల్ పద్మావతి ప్రారంభోత్సవం జరుగుతూన్నట్టు ఊరందరికీ కాయితాలు పంచి పెట్టేసారు. ఆ కాయితాన్ని నాలుగుసార్లు చదువుకున్నాను. ఆ కాయితం చదువుతూంటే ఎందుకో ఆ హోటలు నాదే అయినట్టూ, దాని ప్రారంభోత్సవం నేనే చేస్తూన్నట్టూ నాకు సంతోషం కలిగింది. అయితే ఒక గట్టి చిక్కు వచ్చి పడింది. ముహూర్తం బాగుందని ప్రారంభోత్సవం తెల్లవారుజామున మూడు గంటల ఇరవై నిముషాలకి పెట్టారు. అంత పొద్దున్నే లేచి నేను వెళ్ళడం సాధ్యం కాని పని. చివరికి మనసుని సమాధాన పరచుకుని రోజూ వెళ్ళే వేళకే వెళ్దామని నిశ్చయించుకున్నాను.

తిరిగ్గా ఏడు గంటలకి. రోజూకన్నా కొంచెం నీటుగా ముస్తాబై బయలుదేరాను. పద్మావతి హోటలుకి పోవాలంటే, చెంగయ్య హోటలుని దాటుకుని పోవాలి.

ఒకవేళ చెంగయ్య గుమ్మంలో నిల్చుని 'రండి పంతులుగారూ!' అని పిలుస్తాడేమో? పిలిస్తే మాత్రం, నా ఇష్టమొచ్చిన హోటలుకి వెళ్ళే హక్కు నాకుంది. మధ్యలో చెంగయ్య పిలిస్తే మాత్రం అతని హోటలుకి వెళ్ళాలని ఎక్కడుంది? అయితే, చెంగయ్య పలకరించి లోపలికి రమ్మంటే ఏం చెయ్యాలా అని కాసేపు ఆలోచించాను.

'ఏం చెయ్యనక్కరలేదూ, ఓ చిరునవ్వు చెంగయ్య మీద పారేసి పోడమే' అలా అనుకున్నాను గాని చెంగయ్యను దాటుకుని వెళ్ళడం అన్నది, ఒక సమస్యలాగానే తోచసాగింది నా మనస్సుకి. చివరకి ఎలాగో ధైర్యం తెచ్చుకుని బయలుదేరాను. అనుకున్నట్టుగానే చెంగయ్య, శ్రీనివాసా కేఫ్ గుమ్మంలోనే నిలుచుని ఉన్నాడు. నా గుండెలు దడదడ కొట్టుకున్నాయి. 'కొంపతీసి లోపలికి పిలవడు కదా!' కాని చెంగయ్య పిలవలేదు. చూసి చిన్న చిరునవ్వు నవ్వాడు.

'ఎంత పొగరు!'పిలిస్తే ఏం పోయింది?

అయినా ఇలాంటి వాడి హోటలుకి నేనెందుకు వెళ్ళాలి? వెళ్ళడం శుద్ధ దండుగ.


డా పి.వి.కె. రావ్, B.A., సెక్స్ స్పెషలిస్ట్



వైద్యవిద్వాన్ — వైద్యాచార హస్త ప్రయోగం నరముల బలహీనత, అంగము చిన్నదగుట, శీఘ్రస్కలనము శుక్లనష్టము, సుఖరోగములకు, మానసిక వ్యాధులకు శాస్త్రీయ చికిత్స, పోస్టుద్వారాకూడా చికిత్సగలదు.

రావూస్ క్లినిక్

టి. బి. రోడ్, తెనాలి. ఫోన్ : 700.

కలం - స్నేహితులు

వివిధ ప్రాంతాలలో వున్న కలం—స్నేహితు (స్త్రీ – పురుషు)ల అడ్రస్సుల జాబితా రు. 5-00 M.O. ద్వారా పంపి, జాబితా పొంది వారితో స్నేహం ఏర్పరచుకుని సహకారములు పొందండి. (లేక) 'కలం—స్నేహం' వివరములు కావలసినవారు 80 పై. స్టాంపు పంపండి.

D. S. Pen-Friends Association,
MAGATAPALLI - 533248.
E. G. Dt. (A.P.)

దేహపుష్టికి ఆరోగ్యానికి

పండిత-డి.గోపాలాచార్యులవారి

జీవామృతం

1898 నుండి ప్రసిద్ధి గాంచినది

ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్)లిమిటెడ్
మదరాసు.17.

వైద్యము

నత్తియుందా? బాగుగామాట్లాడుటకు డా. సూరత్‌కర్ "అంటిస్టామర్ పెట్స్" వాడండి. అనేకులు లాభపడ్డారు. ఉత్తరాలు ఇంగ్లీషులో వ్రాసి, 50 Ps. Stamp జతచేసి పంపండి.

Ramakant Brothers,
480, Shanwarpeth, Poona-30.

మాట్లాడకుండా చెంగయ్యను దాటుకుని పద్మావతి హోటలు లోపలికి అడుగు పెట్టాను.

కౌంటరులో ఎవరో ఇరవయిఏళ్ళ కుర్రాడు కూర్చుని ఉన్నాడు. చాకులా, అందంగా, తెల్లటి బట్టలతో మెరిసిపోతున్నాడు. చకచక అందరికీ ఏవో పనులు పురమాయిస్తున్నాడు.

## పద్మావతీ విలాస్

'అదీ! ప్రొప్రయిటరు అంటే అలా ఉండాలి!' అనుకున్నాను. కుర్రాడెలా ఉన్నాడో హోటలు కూడా అలాగే ఉంది. లోపలికిపోయి మంచి సీటు చూసుకుని చతికిల పడ్డాను. టిఫినుకు ఆర్డరిచ్చాను.

ఇడ్లీలు వెన్నలా ఉన్నాయి. మొదట్లో చెంగయ్య హోటల్లో ఉన్నట్లుగానే అరచెయ్యి మందాన దళసరిగా ఉన్నాయి. తళతళ మెరిసి పోతూన్న స్టీలు గిన్నెల్లో వేసిన అల్లపు చట్నీ, కొబ్బరి చట్నీ మహరుచిగా ఉన్నాయి సాంబారు ఘుమఘుమ లాడుతూ ఉంది. కాఫీ సంగతి చెప్పనక్కరలేదు. అమృతం లాగుంది.

నాకు చాలా సంతోషం కలిగింది.

ఇంక చెంగయ్యహోటలుకు ఎవ్వరూవెళ్ళడు.

పైన ఫాను చల్లగా తిరుగుతూండటం వల్ల అక్కడే ఒక అరగంట చతికిల పడ్డాను. తర్వాత లేచి, బిల్లు చెల్లించడానికి, కౌంటరు దగ్గరకు వచ్చి, జేబులో చెయి పెట్టి పర్సు బయటకు తియ్యబోయాను.

'టిఫిను బాగుందా పంతులు గారూ!'

మాటలు విని ఉలిక్కిపడి కళ్ళెత్తి చూశాను. కౌంటరులో సాక్షాత్తూ చెంగయ్య! ఇందాకటి కుర్రాడెక్కడా పత్తాలేదు.

'చెంగయ్యా నువ్వా' అన్నానుఆశ్చర్యపోతూ.

'అవును పంతులు గారూ! నేనే!' అన్నాడు చెంగయ్య.

'మరి ఈ హోటలు...' అడిగాను.

'మనదే పంతులు గారూ! కుర్రాడు పట్నంలో చదువు అయిపోయి ఊరికే ఉన్నాడు. తలమ్మకుని ఉద్యోగం ఎక్కడ చేసినా రెండొందలూ, మూడొందలే కదా! ఆ కాడికి ఇక్కడే హోటలు పెట్టుకుంటే పోలే! అని చెప్పి, ఈ హోటలు లేవదీయించాను. ఇంతకీ హోటలు బాగుందా పంతులు గారూ!'

చెంగయ్య ఇంకా ఏదో చెప్తున్నాడు. కానీ నాకు వినపడలేదు. నా చూపు చెంగయ్య నిగాదనించి. చెంగయ్య నెత్తిమీద, అగరు బత్తులతో, దీపాలతో, ఘుమఘుమ లాడి పోతూన్న పూల దండలతో, వెలిగిపోతూన్న పటం మీదకు పోయింది. అక్కడ నాకు కనిపించిందేమిటి?

అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడూ, ఆపదమొక్కుల వాడూ, సర్వజగ రక్షకుడూ అయిన ఆ శ్రీనివాసుని పక్కన చిరునవ్వులు చిందిస్తూ నిలబడి ఉన్న పద్మావతీఅమ్మవారు.

ఆ పటం చూడగానే నాకు సర్వ సందేహాలూ పటాపంచలయి పోయాయి. శ్రీనివాసుని, పద్మావతీ దేవినీ విడివిడిగా ఊహించినందుకు మనస్సులోనే లెంపలు వేసుకుంటూ, బిల్లు చెల్లించి, చెంగయ్య దగ్గర సెలవు తీసుకుని బయటకు వచ్చేసాను.

